క్లుప్తంగా

4న ఉపకరణాల నిర్ధారణ శిబిరం

వేటపాలెం: పేరాల్లోని సమగ్ర శిక్ష, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం ఈ నెల 4వ తేదీ ఉదయం 9 గంటలకు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ జీవీ సుబ్బయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులు 0 నుంచి 18 ఏళ్ల లోపు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగించు కోవాలని కోరారు.

చినగంజాం: బాపట్ల జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ సోమవారం చీరాలలోని పేరాల ఏఆర్ఎం హైస్కూల్‌లో మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి బి. అజయ్‌బాబు తెలిపారు. అవసరమైన ఉపకరణాలు అందజేస్తారని తెలిపారు.

నేటిలోగా పింఛన్ల పంపిణీ

చీరాల టౌన్: ఎన్టీఆర్ భరోసా పథకంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ల పంపిణీని శనివారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని చీరాల నియోజకవర్గ ప్రత్యేకాధికారి, చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర నాయుడు ఆదేశించారు. శుక్రవారం పింఛన్ల పంపిణీని మండలంలోని పలు గ్రామాలు, మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఆర్డీఓ పరిశీలించి లబ్ధిదారులకు అందించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పింఛన్ పంపిణీ విధులు కేటాయించిన సచివాలయాల ఉద్యోగులు, వీఆర్వోలు, పంచాయతీరాజ్ సిబ్బంది పింఛన్ల పంపిణీ అవకతవకలు లేకుండా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించాలన్నారు. మంచంలోనే ఉంటున్న బాధితులు, దివ్యాంగులు అందరికి త్వరగా పింఛన్లు అందించాని, శనివారంలోగా అందించి సోమవారం వివరాలను సమర్పించాలన్నారు. తహసీల్దార్ కె.గోపికృష్ణ, ఎంపీడీఓ బి.శివన్నారాయణ, పంచాయతీల సెక్రటరీలు, వీఆర్వోలు, సచివాలయాల ఉద్యోగులున్నారు.

తల్లిపాలు పుత్తడి.. పోతపాలు ఇత్తడి

పర్చూరు(చినగంజాం): తల్లిపాలు పుత్తడి కాగా పోతపాలు ఇత్తడితో సమానమని ప్రతి ఒక్కరు తమ బిడ్డలకు తల్లిపాలు తప్పనిసరిగా పట్టించాలని పర్చూరు సీడీపీఓ సుభద్ర సూచించారు. ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు శుక్రవారం ఉప్పుటూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. తల్లి పాలు పట్టించడం ద్వారా ఇరువురికి కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, ముర్రుపాలపై అపోహలు తదితర అంశాలు గురించి వివరించారు. ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యుడు డాక్టర్ దాసరి చంద్రశేఖర్, చెరుకూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ గౌతమ్, అంగన్ వాడీ సూపర్ వైజర్‌లు బి. సునంద గ్రామ ప్రజలకు తల్లిపాలు ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉప్పుటూరు పంచాయతీ సర్పంచ్ ఎర్రాకుల తిరుమలేశ్వరరావు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, సీహెచ్ఓ శృతి, మహిళా పోలీస్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

చీరాల అర్బన్: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యదాయకమని, తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ ఝాన్సీరాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం పట్టణంలోని థామస్‌పేటలో ఆమె ప్రారంభించారు.

చీరాల టౌన్: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి బిడ్డకు రెండేళ్లపాటు తల్లిపాలను ఇవ్వడం వలన బిడ్డలు ఆరోగ్యవంతులుగా ఉంటారని సీడీపీఓ ఝాన్సీ అన్నారు. ముర్రు పాలల్లో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు.

యద్దనపూడి: తల్లి పాలు శిశువుకు అమృత తుల్యం వంటిందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని పోలూరు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు.

బల్లికురవ: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సంతమాగులూరు సీడీపీఓ డి. సుధ కోరారు. శుక్రవారం పాత మల్లాయపాలెం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పించారు.



ఆస్పత్రి సూపరింటెండెంట్ నివాసం ఇలా..



నిర్మానుష్యంగా మారిన వైద్యుల నివాస సముదాయం

వృథా భవనాలు.. వైద్యుల వెతలు

- చీరాల ప్రభుత్వాసుపత్రిలో నిరుపయోగంగా వైద్యుల క్వార్టర్స్
- విష సర్పాలకు, మందు బాబులకు అడ్డాగా మారిన వైనం
- దూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్న వైద్యులు, సిబ్బంది

చీరాల రూరల్: దుగ్గిరాల గోపాల కృష్ణయ్య స్మారక 100 పడకల చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల నిరుపేద రోగులకు సంజీవని వంటిది. చీరాల, బాపట్ల, పర్చూరు నియోజవర్గాలకు చెందిన వందలాది మంది రోగులు ప్రతిరోజూ ఇక్కడ వైద్య సేవలు పొందుతుంటారు. రోగులకు అవసరమైన అన్ని వైద్య సేవలు ఈ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. అయితే ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ వైద్యశాలలో పని చేసే వైద్యులు, వైద్య సిబ్బంది క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. గదుల్లోని డోర్లు, కిటికీలు దొంగల బారినపడి మాయమయ్యాయి. మరికొన్ని గదులపై భాగంలో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇక్కడ జనసంచారం లేకుండా మరుగుగా ఉండటంతో మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. వీటిని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల లాల్ బహదూర్ శాస్త్రి నగర్‌లో ఎంతో సువిశాల ప్రదేశంలో నిర్మించారు. వైద్యశాల నిర్మించి ఏళ్లు గడుస్తుండటంతో కొన్ని గదులు శిథిలావస్థకు చేరాయి. దీంతో వైద్యశాల వెనుక ఏడేళ్ల క్రితం నూతనంగా రూ. 10 కోట్లు వెచ్చించి కొత్త ఆస్పత్రి భవనాలు నిర్మించారు. అయితే పాత ఆస్పత్రి నిర్మించిన సమయంలోనే అదే ఆస్పత్రి ప్రాంగణంలో వైద్యులు, వైద్య సిబ్బంది కోసం క్వార్టర్లను కూడా నిర్మించారు. ఆస్పత్రి సూపరింటెండ్‌తో పాటు అంతా ఆ క్వార్టర్స్‌లో నివాసముంటూ నిరంతరం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాల్సి ఉంది. కానీ గత ఏడేళ్లకు పైగా క్వార్టర్స్ నిరుపయోగంగా మారిపోయాయి. క్వార్టర్స్‌ను మరమ్మతులు చేసి దూర ప్రాంతాల నుంచి నిత్యం వచ్చే వైద్యుల కోసం కేటాయిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



నిరుపయోగంగా వైద్య సిబ్బంది, క్వార్టర్స్

పర్యవేక్షణ కరువు..

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉందన్న చందాన ఈ ఆస్పత్రిలో రోగులకు అవసరమైన అన్ని విభాగాలున్నాయి. ఒకరిద్దరు మినహా అన్ని విభాగాలకు సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు. కానీ ఆస్పత్రికి పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలోని క్వార్టర్స్‌ను పునరుద్ధరించి వైద్యులు, వైద్య సిబ్బదికి కేటాయిస్తే ఆస్పత్రికి పూర్వ వైభవం వస్తుందని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు కోరుకుంటున్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. లవన్న సూచించారు. కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. మండల కేంద్రమైన పర్చూరులో డయాలసిస్ పేషెంట్లకు, వితంతువులకు పెన్షన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్‌లు 8224 ఉన్నాయని, 179 కొత్త పెన్షన్‌లు మంజూరు అయ్యాయని వాటిలో రెండు డయాలసిస్ పేషెంట్‌ల పెన్షన్‌లు, 179 వితంతు పెన్షన్‌లు మంజూరు అయినట్లు తెలిపారు. డయాలసిస్ పేషెంట్‌లకు ఒక్కొక్కరికి రూ. 10 వేలు పంపిణీ చేయగా మండలంలో మొత్తం 8403 మంది పెన్షనర్‌లకు రూ. 3,50,42,500 పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ కె. సత్యనారాయణ, పర్చూరు పంచాయతీ కార్యదర్శి ఏ. మస్తాన్‌రావు, వీఆర్వో వై. శ్రీనివాసరావు, పార్టీ నాయకులు షంషుద్దీన్, ఆకుల శ్రీనివాసరావు, టి. శ్రీనివాసరావు, షేక్ బాబు, జి. శ్రీనివాసరావు, రంగిశెట్టి రవి, జగన్, గద్దె లక్ష్మణుడు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లవన్న

ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో ప్రత్యేక గుర్తింపు

వేటపాలెం: ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందిన వారికి ఉన్నత చదువుల్లో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయురాలు తలమల దీప్తి పేర్కొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్‌సీసీ అధికారి తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2025లో ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన 17 మందిలో 15 మంది ఎన్‌సీసీ విద్యార్థులున్నారని తెలిపారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

అద్దంకి: పట్టణంలోని పాలిటెక్నిక్ ప్రభుత్వ కళాశాలలో 2026 సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జి. రాజకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలకు వచ్చే సమయంలో పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు, పదో తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం వెంట తీసుకుని రావాలని కోరారు. స్పాట్ అడ్మిషన్ల కింద చేరే విద్యార్థులు పూర్తి రుసుం రూ.6వేలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అద్దంకి కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం



పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

చీరాల: పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం చీరాల మండలం దేవాంగపురిలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు అందించారు. సంపద సృష్టించి, పేదలకు పంచుతామని వెల్లడించారు. ప్రజలను ఆదుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. పి4 కార్యక్రమం ద్వారా శ్రీకారం చుట్టిందన్నారు. ఎం.గౌరీ అమర్నాథ్, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఏకగ్రీవ ఎన్నిక



అధ్యక్ష , కార్యదర్శులు

అద్దంకి: మునిసిల్‌వర్కర్స్ యూనియన్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక సమావేశం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షునిగా పి. ఆదాం, ప్రధాన కార్యదర్శిగా ఉసురుపాటి శామ్యూల్, ఆఫీస్ బేరర్ సభ్యులుగా ఉపాధ్యక్షుడు గాలి భీష్మ, సహాయ కార్యదర్శిగా జ్యోతి రాఘవయ్య, కోశాధికారిగా జ్యోతి వెంకట్రావు, మరో 12 మంది కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కమిటీ పరిశీలకులుగా షేక్ మజుందార్, తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మజుందార్ మాట్లాడుతూ యూనియన్ ఐక్య పోరాటాలతో డిమాండ్స్‌ను సాధించుకోవచ్చని చెప్పారు.

విద్యతోనే జీవితం



బల్లికురవ కళాశాలలో మాట్లాడుతున్న ఎస్సై

బల్లికురవ: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్సై వై. నాగరాజు కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాపట్ల ఈగల్ క్లబ్ బృందం ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంలో ఎస్సై మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. సుధాకర్, అధ్యాపకులు, క్లబ్ బృందం పాల్గొని మాట్లాడారు.

బీసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా కొల్లాటి



కొల్లాటి ఏడుకొండలు

చినగంజాం: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ విభాగ ప్రధాన కార్యదర్శిగా కొల్లాటి ఏడుకొండలు నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. చినగంజాం మండలం కొత్తపాలెం పంచాయతీ రామ చంద్రనగర్ గ్రామం మత్స్యకార కుటుంబానికి చెందిన కొల్లాటి ఏడుకొండలు రాష్ట్ర బీసీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడం పట్ల పలువురు పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

10673 మందికి అన్నదాత సుఖీభవ

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని అన్ని గ్రామాల్లో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమానికి మొత్తం 10673 మంది రైతులు ఎంపికైనట్లు వ్యవసాయాధికారి ఎస్. మేరిమ్మ తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి రూ. 5 వేలు, పీఎం కిసాన్ సమృద్ధి యోజన పథకానికి రూ. 2 వేలు రైతుల బ్యాంకు ఖాతాలో శనివారం జమ చేస్తారని తెలిపారు.

ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదకరం

పర్చూరు(చినగంజాం): ఊపిరి తిత్తుల క్యాన్సర్ సోకకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ సూచించారు. ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవ అవగాహన కార్యక్రమం శుక్రవారం ఉప్పుటూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశంలో ఊపిరితిత్తుల క్యాన్సరే నాలుగో స్థానంలో ఉందని ప్రతి ఏటా సుమారు 72 వేల కేసులు నమోదు అవుతున్నాయన్నారు. క్యాన్సర్ వల్ల సంభవించే మరణాల్లో 8 శాతం మరణాలు కేవలం ఊపిరితిత్తుల క్యాన్సర్ వలన సంభవిస్తున్నాయని తెలిపారు. ఊపిరి తిత్తుల క్యాన్సర్ నివారించే మార్గాలు మన చేతుల్లోనే ఉన్నాయని తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణమైన సిగరెట్, బీడీ చుట్టలు తాగటమే కాదని వాటి నుంచి వెలువడే పొగాను పక్కవాళ్ళు పీల్చడం కూడా అత్యంత ప్రమాదకరమన్నారు. అంతేకాకుండా కట్టెల పొయ్యి పొగ, పెరుగుతున్న వాయు కాలుష్యం, ఆస్బెస్టాస్ సిమెంట్ దుమ్ము, అనువంశికత వంటివి కూడా క్యాన్సర్‌ను కలుగజేస్తాయని తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడకుండా ఉండటం కోసం ధూమపానాన్ని మానేయడం, దుమ్ము, ధూళి ఉండే పని ప్రదేశాల్లో మాస్కులు తప్పనిసరిగా ధరించడం, పౌష్టికరమైన ఆహారం, నిరంతరం వ్యాయామం చేయడం, అధిక ముప్పు ఉన్నవారికి స్క్రీనింగ్ పరీక్షలు అవసరమని సూచించారు. ప్రపంచ ఆరోగ్య భవిష్యత్ విద్యార్థులపైన ఆధారపడి ఉందని కేవలం విద్యార్థులు వారు మాత్రమే కాకుండా వారి కుటుంబంలోని సభ్యులు, చుట్టుపక్కల వారిని ధూమపానానికి దూరంగా ఉంచటానికి కృషి చేయాలని ఈ విషయాలను అందరికి తెలియజేయాలని కోరారు.

లోఓల్టేజ్‌తో తిప్పలు

జె.పంగులూరు: మండల పరిధిలోని బూదవాడలోని ధనలక్ష్మి కాలనీలో గత నెల రోజుల నుంచి లో ఓల్టేజ్ సమస్యతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో మినీ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన నెలరోజులు దాటిని దానికి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లు కాలి కిందికి వేలబడుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. కాలనీ వాసులు రెండు, మూడు పర్యాయాలు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న దాఖలాలు లేవని కాలనీ వాసులు వాపోతున్నారు. లో ఓల్టేజ్ సమస్యలు వలన కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు గురౌతున్నారు. రాత్రి సమయాల్లో లైట్లు వెలుతురు రాక, ఫ్యాన్లు స్పీడుగా తిరగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



బూదవాడ ధనలక్ష్మి కాలనీలో కాలిపోయిన కరెంటు వైర్లు, ఫీజులు

భక్తిశ్రద్ధలతో శ్రావణ మాస పూజలు

వేటపాలెం: ఆణుమల్లి పేట లో మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద గల మందిరంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.రాజ్యలక్ష్మి, అనంతలక్ష్మి, మంజుల, రమాదేవి, సత్యవతి, సమంత పాల్గొన్నారు.

చినగంజాం: శ్రావణ మాసంలో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ వలివేట వెంకట రామానుజం అన్నారు. భావన్నారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించారు.

అధికారం కోసం బూటకపు హామీలు



పర్చూరు: ప్రజలకు కూటమి మోసపు హామీలను వివరిస్తున్న నాయకులు

పర్చూరు(చినగంజాం): అధికారం కోసం బూటకపు హామీలిచ్చి రాష్ట్ర ప్రజలను చంద్రబాబు మోసం చేశారని పర్చూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కఠారి అప్పారావు అన్నారు. శుక్రవారం కొల్లవారిపాలెం, పెద్దివారిపాలెం, నాగులపాలెంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని కన్వీనర్ కఠారి అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు. మూడు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి బాబు మోసాలను గురించి ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ అమలు చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాకు హామీని గాలికొదిలేశారన్నారు. గ్రామాల్లోని ప్రజలకు క్యూఆర్ కోడ్ కరపత్రాలను పంపిణీ చేసి దానిని ఉపయోగించే విధానాన్ని వివరించారు. లంకశివ, ముప్పాళ్ళ రాఘవయ్య, కోట శ్రీనివాసరావు, దాసరి వెంకట్రావు, గాదె సురేష్, కొల్లా శ్రీహరి, శేషగిరి, జంగా అనిల్, జెట్టి చంద్రం, సరోజినీ, మండల పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నిరాటంకంగా రోటరీ సేవలు

జె.పంగులూరు: రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు నూతన అధ్యక్ష కార్యదర్శుల ప్రమాణ స్వీకారం పంగులూరులో శుక్రవారం జరిగింది. రొటేరియన్ వీర రాఘవయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ అడ్మినిస్ట్రేట్ చైర్మన్ అన్నె రత్న ప్రభాకరం చేతుల మీదగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షునిగా డాక్టర్ బత్తుల వీరనారాయణ రావు, కార్యదర్శిగా రాయిణి రామారావు, కోశాధికారిగా షేక్ కాలేషావలి ప్రమాణ స్వీకారం చేశారు. వీరనారాయణ మాట్లాడుతూ వైద్య శిబిరాలతో పాటు ఎస్ఏ రైటింగ్, టాలెంట్ టెస్టు నిర్వహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎక్కువగా మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తామని తెలిపారు. సాయిల్ టెస్టు ల్యాబులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పంగులూరులో బస్టాండ్ నిర్మాణానికి, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. రోటరీ గంగాను డోర్ డెలివరి చేసే విధంగా చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, సీజీఏ కొల్లా సింగారావు, అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బాచిన చెంచు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పంగులూరు రోటరీ క్లబ్ అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బత్తుల వీరనారాయణ

రెడ్ బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపు



చెన్నుపల్లిలో ఎంపికైన గ్రామ, బూత్ కమిటీ

బల్లికురవ: కూటమి ప్రభుత్వం ఎన్నికల సూపర్‌సిక్స్ హామీలు అమలు పరచకుండా రెడ్‌బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపుకు పాల్పడుతుందని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. శుక్రవారం రాత్రి చెన్నుపల్లి గ్రామంలో గ్రామ, బూత్ కమిటీలను ఎంపిక చేశారు. మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలైన ఉచిత గ్యాస్, తల్లికి వందనం, అర్హులకు దక్కడం లేదన్నారు. వైఫల్యాలను ఎండగట్టేందుకే కమిటీల ఎంపికతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకనే కూటమి నేతలు పోలీస్ అధికారులతో కుమ్మక్కై ఆయన పర్యటనలను అడ్డుకుంటున్నారన్నారు. ఇటీవల పొదిలి, సత్తెనపల్లి, నెల్లూరులో జరిగిన పర్యటనలను అడ్డుకున్నా ప్రజలు ఆగటంలేదని కృష్ణబాబు వివరించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడుగా కందుల నాగేశ్వరరావు, తంగిరాల కొటయ్య, బూత్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు దేవరకొండ ఆదాం, కంభంపాటి భాస్కరరావు, స్థానిక నేతలు ధూపాటి దిబ్బయ్య, శేషయ్య, తంగిరాల ఐయన్న, జాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.